# క్రీ॥శకం-2025

పొన్నపల్లి ఉషాదేవి



"ఏమన్నారు పెళ్ళివారు? మన అబ్బాయిని చేసుకుంటామన్నారా!" భార్య మాటలకి ఏం సమాధానం చెప్పాలో తెలియక, గాఢంగా నిట్టూర్పు విడుస్తూ పడక్కుర్చీలో కూర్చున్నాడు మూర్తి. చాతకానితనం, అసమర్థత అన్నీ ఆయన గుండెల్లో గునపాలు దింపుతున్నంత బాధ కలిగిస్తున్నాయి. అసహనంగా, అసంకల్పితంగా ఆయన చేయి తలమీదికి వెళ్ళింది.

"అయ్యో!! నెత్తిమీద చెయ్యి పెట్టుకోకూడదండీ! పెళ్ళివారు ఏమన్నారు?" అంది శారదమ్మ.

"ఏమంటారు? ఏమంటారే?? మనవాడి చేతి బొటనవేలు కొద్దిగా వంకరగా వుందిట. ఆ పిల్ల వీడ్ని చూస్తే చేసుకోనుగాక చేసుకోను అంటోందిట. చాలా? ఇంకా వివరంగా చెప్పాలా?" విసుగ్గా అన్నాడు మూర్తి.

కృంగిపోయినట్లుగా నేలమీద చతికిలబడింది శారదమ్మ. మనవాడి వేలు వంకరగా వుందా? మనమెప్పుడూ గమనించలేదే. ముప్పై ఏళ్ళుగా పెంచుతున్నాం? సాలోచనగా అంది.

"వంకరా, పాడా! ఏదో వంక పెట్టాలని అట్లా అన్నారు" కసిగా అన్నాడు మూర్తి.

కట్నం విషయం కూడా మనమేమీ నాన్చలేదు కదండీ. వాళ్ళడిగినంత ఇస్తామన్నాం కదా. ముప్పై ఏళ్ళొచ్చినా పిల్లవాడి పెళ్ళిచెయ్యలేక పోతున్నామని ఇరుగు, పొరుగు వారు చెవులు కొరుక్కుంటున్నారు.

"అంతా మన ఖర్మే శారదా! ముగ్గురూ మగపిల్లలే పుట్టడం మన దురదృష్టం" బాధగా అన్నాడు మూర్తి.

"అవునవును, ఎంత బాగా సెలవిచ్చారండీ. శంకరం పుట్టాక, నేను నెలతప్పగానే- స్కానింగ్‌లో కడుపులో వున్నది ఆడపిల్లని తెలిసి నిర్మొహ మాటంగా నిర్దాక్షిణ్యంగా ఎబార్షన్ చేయించారు కదా. మగపిల్లలయితే సుఖాలే సుఖాలు అని విర్రవీగిపోయారుగా, అనుభవించండి" కసిగా అంది శారదమ్మ.

"నోర్ముయ్. నేనేదో మహాపరాధం చేసినట్లుగా మాట్లాడుతున్నావే. నీకు ఎబార్షన్ చేయించినప్పుడు నోరు మెదపలేదుగానీ, ఇప్పుడు సాధిస్తున్నావు.

"నేను వద్దు మహాప్రభో, ఆడపిల్ల పుడితే మహాలక్ష్మి పుట్టినట్లండీ అని నెత్తీ, నోరూ బాదుకుని ఏడిస్తే నీ ఇష్టం వచ్చినట్లు ఏడు. అమ్మాయి మాత్రం వద్దుగాక వద్దు" అని కడుపులోని పిచ్చితల్లిని కడుపులోనే చంపేశారు కదా గుడ్లనీరు కుక్కుకుంటూ అంది శారదమ్మ.

"నేనొక్కడినే కాదు. ఆ రోజుల్లో అందరూ అలాగే చేశారు" సమర్థించుకుంటున్నట్లుగా అన్నాడు మూర్తి.

శారదమ్మ ఏదో మాటాడాలని అనుకొంటూండ గానే "మూర్తిగారూ" అంటూ పెళ్ళిళ్ళ పేరయ్య వచ్చాడు.

క్షణకాలంపాటు మూర్తి కళ్ళల్లో ఆశ.

"రండి-రండి" అని కుర్చీలోనుంచి లేచి మరీ ఆహ్వానించాడు.

"మీ అదృష్టం. శంకరానికి ఒక సంబంధం తీసుకువచ్చాను. చచ్చీ-చెడీ వెతకినా ఎంతకీ దొరకలేదండీ బాబూ" అంటూ కూర్చున్నాడు పెళ్ళిళ్ళ పేరయ్య.

ఆత్రంగా ముందుకు వంగారు శారదమ్మ-

మూర్తి. "అమ్మాయి పెద్దగా చదువుకోలేదు. అంత పెద్ద అందగత్తెకూడా కాదు. పై వరస పళ్ళు బాగా ఎత్తుగా వుంటాయి. కట్నం కూడా మూడున్నరకి తగ్గరట" కరాకండీగా చెప్పేశాడు పేరయ్య.

ఆలోచనలో పడ్డాడు మూర్తి. వెంటనే ఏమీ మాట్లాడలేదు. కానీ, శారదమ్మ మాత్రం వెంటనే అంది "బాబ్బాబు, మీకు పుణ్యం వుంటుంది ఈ సంబంధం ఎలాగైనా సరే కుదిర్చి పెట్టాలి మీరు" బతిమాలుతున్నట్లుగా అంది శారదమ్మ.

మూడున్నర లక్షలట. ఎలా తెస్తావు?? కోపంగానే అన్నాడు మూర్తి.

"బంగారం అమ్మేద్దాం. లేకపోతే ఇంటిని అమ్మేద్దాం" స్థిరంగా అంది శారదమ్మ.

తన గదిలో కిటికీ దగ్గర నిలబడి ఈ సంభాష ణంతా వింటున్నాడు శంకరం – ఛీ. నేను ఆడపిల్లగా పుట్టివుంటే ఎంత బావుండేది. ఇంటికి భారమై పోయాడు తను. తనకి పెళ్ళయితేగాని తమ్ముళ్ళ పెళ్ళిళ్ళు చేయడానికి లేదు. తమ్ముళ్ళు తన వేపు అదోరకంగా చూస్తున్నట్లుగా అనిపిస్తుంది తనకు. ఎందులోనన్నా పడి చస్తేగాని నా పీడ వీరికి పోదు. శుబ్బరంగా వుంది తన వేలు. వేలు వంకరగా వుందని వంకపెడతారా! ఛి. వెధవ బతుకు-వెధవ బతుకు. కళ్ళవెంబడి నీరు కారింది శంకరానికి.

"ఎన్ని సంబంధాలని వెతకగలం తల్లీ ఇవాళ దేశంలో ఇరవై మంది మగవారుంటే ఒక్క ఆడపిల్ల వుంటుంది. ఎంత కష్టపడి వెతికినా లాభం కలగట్లేదు. తన మామూలు కోసం ఇకిలించాడు పేరయ్య.

గమనించినట్లుగా అన్నాడు మూర్తి... "సరేనండీ పేరయ్యగారూ. మీ కష్టాన్ని ఉంచుకుంటామా! మీరూహించిన దానికన్నా ఎక్కువే ఇస్తాము".

సంతోషంతో, ఆడపిల్ల వారింటికి దాదాపు గాల్లో ఎగురుతున్నట్లుగా పరుగెత్తాడు పేరయ్య గారు.

వాళ్ళింటి మెట్లెక్కుతున్నాడు. ఎదురుగా ఒక పది పదిహేనుమంది గుమ్మంలోనే కనిపించారు. వాళ్ళు వెళ్ళిపోయాక, పెళ్ళివారితో అసలు విషయం చెప్పాడు.

"అయ్యో! మా అమ్మాయికి పెళ్ళి కుదిరిపోయిందండీ. మీరు ఒక్క పావుగంట ముందు వస్తే బావుండేది" అన్నాడు పెళ్ళికూతురు తండ్రి.

కాళ్ళీడ్చుకుంటూ మూర్తిగారింటికి వచ్చాడు.

ఆ సాయంత్రం నాలుగు గంటలనుంచీ గుమ్మంలో కూర్చున్నారు మూర్తి, శారదమ్మ. క్షణమొక యుగంలాగా అన్పిస్తోంది. పేరయ్యగారు రానేవచ్చారు. వివరాలు చెప్పటం మొదలు పెట్టారు.

మీరు తల తాకట్టుపెట్టయినా సరే వారు అడిగిన లాంఛనాలు ఏర్పాటు చేసుకోండి. మీ అబ్బాయిని రెండవ భర్తగా చేసుకోవడానికి ఆ అమ్మాయి ఒప్పుకుంది. ఇంకో షరతుంది లెండి. తన వెంట పడుతున్న పెళ్ళికొడుకు తండ్రులను చూసి, జాలిపడి ఆమె అయిదు పెళ్ళిళ్ళు చేసుకుంటానని నిర్ణయించుకుందిట. కొన్నాళ్ళు ఒకళ్ళతో కాపురం, కొన్నాళ్ళు ఇంకొకళ్లతో కాపురం. అందుకుగాను తనకూ, తన భర్తలకూ తనకు పుట్టబోయే పిల్లలకోసం తమకి ఎయిడ్స్ లాంటి ప్రమాద వ్యాధులు రాకుండా, జీవితాంతమూ ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహిస్తూ వారికి కావలసినంత వైద్యసేవ చేయాలిటమీరు

వింటున్న శంకరం మనసు మూలిగింది. తను ఆమెకు రెండవ మొగుడా. ఇంకా కొంతమందిని చేసుకుంటుందా! గతంలో భార్యాభర్తలు తమకు పుట్టబోయేది ఆడిశిశువు అని తెలియగానే ఎబార్షన్ చేయించడమో కుప్ప తొట్టిలో పడెయ్యడమో చేసిన వారంటే జుగప్స కలిగింది శంకరానికి.

విషయమంతా విన్న తరువాత కొద్దిసేపు మౌనంగా ఉండిపోయాడు మూర్తి. భార్య కడుపులో తాను చంపేసిన అమ్మాయి తన ఎదురుగా నిలబడి కన్పిస్తున్నట్లుగా అనిపించింది అతనికి. అయినా, తనొక్కడే చేశాడా ఈ పాపం. ఇరవై రెండేళ్ళ క్రితం

మే 11, 1998 న రాజస్థాన్‌లో పోఖ్రాన్ వద్ద భారత్ రెండోసారి అణు పరీక్షలు నిర్వహించింది. మొదటిసారి నిర్వహించిన అణు పరీక్షలు మే నెలలోనే 1974 వ సం॥ జరగడం యాదృశ్చికం. అందుకే మే 11వ తేదీన టెక్నాలజీ డే గా పరిగణింపబడుతోంది.

నూటికి ఎనభైమంది తను చేసిన పొరపాటే చేశారు. వాళ్ళందర్నీ చూసి తనూ చేయించాడు. అప్పట్లో ఆడపిల్ల అంటేనే ఆటంబాంబుని చూసినట్లు అనిపించేది మరి. మూర్తి ఆలోచనా సముద్రం నుంచి నెమ్మదిగా ఇవతలకు వస్తున్నాడు. పెళ్ళిళ్ళ పేరయ్యతో భార్య అంటున్న మాటలు వినిపించాయి.

"పోనీ పేరయ్యగారూ! మా అబ్బాయిని కూడ పెళ్ళిచేసుకుంటుందేమో అడగండి.

తల గిర్రున తిరిగింది మూర్తికి. తన కొడుకు రెండవ మొగుడుగానా! ఛీ.ఛీ. ఆలోచించడానికే అసహ్యం వేస్తోంది. అమాటే అన్నాడు భార్యతో.

"మీరు మరీ చెప్తారు మూర్తిగారూ. ఏం చేస్తాం మరి? దేశమంతా ఎక్కడ చూసినా మగవారే వుంటున్నారు. కాగడా పెట్టి వెలిగించినా ఆడపిల్ల కనబడటం లేదు. శంకరాన్ని రెండవ భర్తగా అడగడం తప్పుకాదు. నేనిప్పుడే వాళ్ళింటికి వెళ్ళి మాట్లాడివస్తాను- అంటూ లేచారు పేరయ్యగారు.

"అయ్యో! వద్దు-వద్దు పేరయ్యగారూ!" అని అరిచాడు మూర్తి.

"ఏమిటండీ. అరుస్తున్నారు? పేరయ్యెవరు?" భార్య లేపితే మెలకువ వచ్చింది మూర్తికి.

"పీడకలగన్నారా? తెల్లారుఝామునే! ఆంజనేయ స్వామిని స్మరించుకుని మంచం దిగండి" శారద మాటలతో పూర్తిగా స్పృహ వచ్చిందతనికి.

నిర్మలంగా వున్న భార్య మొహంచూసి గిల్టీగా ఫీలైనాడు.

సాయంత్రం చెకప్‌కని డాక్టరుదగ్గరికి తీసుకెళ్లి ఆమె కడుపులో పెరుగుతున్న ఆడపిల్లని హత్య చేయిద్దామనుకున్నాడు. అమ్మో! ఈ పీడకల రాకపోతే బలవంతాన శారదకి ఎబార్షన్ చేయించేవాడే. ఇప్పుడు బుద్ధొచ్చింది. అనుకున్నాడు.

"నేను సీతాదేవిని తల్చుకుంటానేం?" అంటూ ప్రసన్నంగా భార్యవేపు చూశాడు. బుద్ధొచ్చిన మూర్తి.

**చినుకు** సాహిత్య మాస పత్రికకు
చందాదారులవ్వండి. మీ చుట్టూ ఉన్న
సమాజంలో మీరు ఓ వెలుగుదివ్వె అవుతారు.

# కలల కల కల

డా॥ కె. గీత

బొత్తిగా మాటలు రాని యంత్రం
హఠాత్తుగా మేఘావృత ఆకాశమై
మాటల వానల వీనుల విందై
ఊపిరి వాగున ఎగిరే శ్వాసై
గుండె మునివాకిలి చీకటి తెల్లారగట్ల
వెన్నెల చలిలా రెక్కలు వాల్చింది
చప్పున సాగే స్థిరస్వరం వెంబడి
అలజడి పరుగుల పసిపాపై
వేగపు వాలుకెరటాల లేలేత నీలిరంగై
ఆచ్ఛాదనల వెల్లువ తాకిన రెప్పపాటై
మెలికెల తీగల్ని మెడచుట్టూ అల్లుకుని
అంకెల పాన్పుకి నిస్త్రాణగా చేరింది
ఎప్పుడో మనసు జ్ఞానాన్కి సుపరిచితమైన
అజ్ఞాతం
వెన్ను వణికించే జాబిల్లి ముగ్ధ మోహన
శ్వేత కిరణం తాకిన క్షణం
నిశ్శబ్దంగా శబ్ద పరిచయం ఆగి ఆగి మోగిన
మంత్రోన్మేష నిమిషం
ఒక జీవితకాలపు అనుభూతి
ఘడియల్లో వేనవేలై ముంచెత్తిన గళం
ఇప్పుడు పుడమి ఒక పరవశపు పున్నమి
ఋతువులు వర్షాతిరేకాన్ని త్రావిన అమృత
ఝరులు
కంటిపాపనిండా శబ్దం విస్తరించి
విస్మరణ ధ్వని కణాల్ని లయించి
వట్టి వ్రేలాడే నల్లని పలుచని తీవై
కొసల్ని బంధించి
బొత్తిగా మాటలు రాని యంత్రం
మూగగా రోదించి కన్నీళ్ళు ఆవిరైన చారికల
చెక్కిళ్ళనానుకొని
మంచురాత్రి ఆవాహన తడిస్పర్శ ముద్రల్లో
కలల కలత నిదురబోయింది. ★